సాక్షి
చిత్తూరు
సోమవారం । 2 । అక్టోబర్ । 2023



పోటెత్తిన కాణిపాకం

కాణిపాకం వినాయక ఆలయం ఆదివారం భక్తజనసంద్రమైంది. ఉదయం నుంచే క్యూలు నిండిపోయాయి.

- 8లో



అంతా కార్డ్ లెస్

డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ కార్డులను రవాణాశాఖ డిజిటలైజేషన్ చేసింది. మంజూరు పత్రాలను ఆన్‌లైన్‌లో జారీ చేస్తోంది.

- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	24
తిరుపతి	36	26
తిరుమల	31	21
గూడూరు	36	27
నగరి	36	26

న్యూస్‌రీల్

భక్తజన బోయకొండ



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లి: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తజనసంద్రమైంది. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచే భక్తుల రద్దీ కొనసాగడంతో క్యూలన్నీ నిండిపోయాయి. భక్తులకు అవసరమైన సౌకర్యాలను దేవస్థానం ఈఓ చంద్రమౌళి పర్యవేక్షించారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఎస్‌ఐ రవికుమార్ ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేశారు.

27న తెలుగు భాషా పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈనెల 27వ తేదీ జిల్లా స్థాయి తెలుగు భాషా పోటీలు నిర్వహించనున్నట్లు తెలుగు భాషా సమితి అధ్యక్షుడు తులసినాథం నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు భాష ప్రత్యేకత అనే అంశంపై వ్యాస రచన పోటీలు ఉంటాయని తెలిపారు. వందకు పైగా పద్యాలు చెప్పగలిగిన పిల్లలకు ప్రత్యేక పోటీ, తెలుగు అక్షరాలను ఉపయోగించి చిత్రలేఖనం, వ్యాసాల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోపు వ్యాసాలను, చిత్రాలను, పిల్లలు చెప్పగలిగే పద్యాల మొదటి పాదాలను కళామందిరం, సాయిగార్డెన్ సిటీ, గంగవరం చిరునామాకు తపాలా ద్వారా పంపాలని తెలిపారు. ప్రతి విభాగంలో ప్రతిభ కనబరచిన 15 మంది చొప్పున మొత్తం 45 మందికి ఈనెల 27 వ తేదీన జరిగే వార్షికోత్సవంలో జ్ఞాపికలు, బహుమతులు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో స్వచ్ఛతాహీ సేవ

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆదివారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయ పరిసరాల్లో చెత్త చెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా కో–ఆర్డినేటర్ సుదర్శన్, డీఎస్‌ఓ శిరీష, ఎపిడిమాలజిస్ట్ శ్రీవాణి తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి గ్రామసభలు

చిత్తూరు రూరల్: గాంధీ జయంతిని పురస్కరించుని జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఈనెల 3 నుంచి 14వ తేదీ వరకు సాధారణ గ్రామసభలు నిర్వహించాలని డీపీఓ లక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. విధిగా ప్రతి పంచాయతీలో సర్పంచ్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలు నిర్వహించాలని పేర్కొన్నారు. గ్రామస్తుల సమక్షంలో గ్రామాభివృద్ధి, స్థానిక సమస్యలు గుర్తించి గ్రామసభ ఆమోదం తీసుకోవాలని తెలిపారు. గ్రామ సభ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

వలస కార్మికులకు రేషన్ కార్డులు

చిత్తూరు రూరల్: ఈ–శ్రమ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న వలస కార్మికులకు 'వన్ నేషన్–వన్ రేషన్' పథకం కింద రేషన్ కార్డుల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు కార్మికశాఖ సహాయ కమిషనర్ ఓంకార్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇటుకబట్టీలు, జ్యూస్ ఫ్యాక్టరీ, ఇతర పరిశ్రమల్లో పనిచేసే ఇతర రాష్ట్రాల వలస కార్మికులు తప్పనిసరిగా ఈ–శ్రమ పోర్టల్ ద్వారా గుర్తింపు కార్డులు పొందవచ్చని పేర్కొన్నారు. తద్వారా రేషన్ కార్డులు, రేషన్ సరుకులు పనిచేసే చోటే పొందవచ్చని తెలిపారు. ఈ పోర్టల్‌లో పేర్ల నమోదుకు గ్రామ, వార్డు సచివాలయం, సమీప కార్మిక శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

స్వచ్ఛతాహీ సేవలో న్యాయమూర్తులు



ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో ఆదివారం స్వచ్ఛతా హీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పుత్తూరు రోడ్డులోని కోర్టు భవనాల్లో పరిసరాలను శుభ్ర పరిచి.. అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్, న్యాయమూర్తులు శ్రీదేవి, మాధవి, ఉమాదేవి, శ్రీనివాసమూర్తి, శ్రీనివాస్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజేంద్రరెడ్డి, అశోక్ ఆనంద్ యాదవ్, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రైవేటు నయా దందా

- చిత్తూరు నగరం సుందరయ్యవీధిలోని ఓ డెంటల్ క్లినిక్ ఆరేళ్ల నుంచి నడుస్తోంది. పెద్ద స్థాయిలో నడుస్తోంది. ఓపీలు కూడా పదుల సంఖ్యలో వస్తుంటాయి. ఇంత వరకు ఈ క్లినిక్‌కు రిజిస్ట్రేషన్ లేదు. తనిఖీకి వెళ్లిన అధికారులు ఈ అక్రమ నిర్వహణ గుట్టును రట్టు చేశారు.
- చిత్తూరు నగరపాలక సంస్థ సమీపంలోని మరో క్లినిక్ కూడా అక్రమంగా నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రేషన్ లేదు. కానీ ఓపీలు వస్తున్నాయి. వైద్యులు చికిత్స చేస్తున్నారు. ఈవిషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో తనిఖీ చేసి జిల్లా యంత్రాగానికి నివేదికలు సమర్పించారు.
- చిత్తూరు పొన్నియమ్మ గుడివీధిలో అనుమతులు లేకుండా ల్యాబ్ నడుపుతున్నట్లు జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదు వెళ్లింది. అధికారులు దాడుల్లో ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదని గుర్తించారు. పలు ఇంజక్షన్‌లు కూడా పట్టుబడ్డాయి. జిల్లాలో ఇలాంటి ల్యాబ్‌లు వందల సంఖ్యలో ఉన్నట్లు అధికారుల అంచనా.



చిత్తూరు నగరంలో ఓ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

జిల్లాలో అనాధికారిక క్లినిక్‌లను ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. ప్రైవేటు క్లినిక్‌లు పుట్టగొడుగులా పుట్టుకొస్తున్నాయి. ఏళ్ల తరబడి రిజిస్ట్రేషన్ లేకుండా... రెన్యూవల్ చేసుకోకుండా ప్రైవేటు క్లినిక్ దందాను గుట్టు చప్పుడు కాకుండా నడిపిస్తున్నారు. అనుమతులు లేకుండా ల్యాబ్ టెస్టుల పేరుతో రక్తాన్ని పిండేస్తున్నారు. నిబంధనలు పాటించని క్లినిక్‌లపై కేసు నమోదు చేయాలని జిల్లా వైద్యాధికారులు నిర్ణయించారు.

- జిల్లాలో ఇష్టారాజ్యంగా ప్రైవేటు క్లినిక్‌లు
- నిబంధనలకు పాతరేస్తున్న నిర్వాహకులు
- ఏళ్ల తరబడి రిజిస్ట్రేషన్‌కు చెల్లు
- రెన్యూవల్‌కు ముఖం చాటేసిన వైనం
- అనుమతులు లేకుండా ల్యాబ్ టెస్టులు
- జిల్లా అధికారుల తనిఖీల్లో బట్టబయలు

చిత్తూరు రూరల్: జిల్లాలో నిబంధనల పాటించని ప్రైవేటు క్లినిక్‌లపై వైద్యాధికారులు కొరడా ఝుళిపించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,800 వరకు ప్రైవేటు క్లినిక్‌లున్నాయి. అనాధికారికంగా మరో 400పైగా పుట్టుకొచ్చాయి. ఇలాంటివి జిల్లా కేంద్రంలో అధికంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సరిహద్దు ప్రాంతాల్లో క్లినిక్‌లు ఇష్టారాజ్యంగా వెలుస్తున్నాయి. ల్యాబ్‌లు సైతం ఇష్టానుసారంగా తెరుచుకుంటున్నాయి. ఇందుకు ప్రధానంగా వైద్య చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ ఉండి తీరాలి. కానీ కొందరు నిబంధనలకు పాతరేస్తున్నారు. రిజిస్ట్రేషన్ రుసుం చెల్లింపులకు ఎగనామం పెడుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఎలాంటి అనుమతి లేకుండా ఏళ్ల తరబడి వైద్యం చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. అధికారుల తనిఖీల్లో చిత్తూరు నగరంలో రిజిస్ట్రేషన్ లేని క్లినిక్‌లు, ఆస్పత్రులు బయటపడ్డాయి. ల్యాబ్‌లు సైతం అనధికారికంగానే నిర్వహిస్తున్నట్లు వెలుగులోకి వచ్చాయి. వాటి వివరాలను సేకరించి అధికారులు జిల్లా యంత్రాంగానికి నివేదికలు పంపారు.

రిజిస్ట్రేషన్ ఇలా ..

ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు నిర్వహణకు తొలుత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలి. వారి నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. క్లినిక్ (ఒకే ఒక డాక్టర్), పాలిక్లినిక్, 9 బెడ్స్ క్లినిక్, 10–20 బెడ్స్ ఆస్పత్రి, 21–50బెడ్స్ ఆస్పత్రి, 50– 100 బెడ్స్ ఆస్పత్రి, సూపర్ స్పెషలిటీ ఆస్పత్రులుగా విభజించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుంది. రిజిస్ట్రేషన్ కోసం వెళితే తొలుత అధికారులు ఆక్లినిక్‌లను పూర్తిగా పరిశీలించి తాత్కాలిక రిజిస్ట్రేషన్ అనుమతి పత్రాన్ని మంజూరు చేస్తారు. తర్వాత 5 సంవత్సరాల కాలపరిమితితో కూడిన పత్రాన్ని మంజూరు చేస్తారు. ఇందుకు ప్రభుత్వానికి కేటగిరీ వారీగా ఫీజులు చెల్లింపులుంటాయి. సంవత్సరానికి రూ.250 నుంచి రూ. 20వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ల్యాబ్‌ల నిర్వహణకు కూడా కేటగిరీ వారీగా రూ. 500 నంచి రూ.10 వేల వరకు రిజిస్ట్రేషన్ రుసుం ఫీజు నిర్ణయించారు. ఇవన్నీ కూడా ఆన్‌లైన్‌లో ద్వారా చెల్లించాల్సి వస్తోంది. కానీ చాలా మంది ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.

గడువు ఇచ్చాం..



వరుసగా క్లినిక్‌లు, ల్యాబ్‌లపై తనిఖీలు చేశాం. ఈ తనిఖీలో రిజిస్ట్రేషన్ చేసుకుని ల్యాబ్, క్లినిక్‌లకు గట్టిగా వార్నింగ్ ఇచ్చాం. రిజిస్ట్రేషన్ చేసుకోవాలని హెచ్చరించాం. వారికి గడువు కూడా ఇచ్చాం. చేసుకోని పక్షంలో కేసులు నమోదు చేయిస్తాం. దీనిపై అధికారులకు కూడా నివేదికలు పంపాం. వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయి.

– రవిరాజు, జిల్లా నోడల్ ఆఫీసర్, పీసీపీఎన్‌డీ

క్రిమినల్ కేసుల నమోదు



క్లినిక్‌లను నిబంధనలకు విరుద్ధంగా నడపకూడదు. అలా చేస్తే క్రిమినల్ కేసులు పెట్టిస్తాం. ఫిర్యాదులు వస్తే ఎట్టిపరిస్థితుల్లో వారిని వదిలిపెట్టాం. వచ్చిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్తున్నాం. తనిఖీలో వచ్చిన నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటాం. అనధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే ఫిర్యాదు చేయవచ్చు.

– ప్రభావతిదేవి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

రేపటి నుంచి ఎఫ్‌ఏ-2 పరీక్షలు

- 14 నుంచి దసరా సెలవులు
- డీఈఓ విజయేంద్రరావు



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి 6వ తేదీ వరకు అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఎఫ్ఏ2 (ఫార్మేటివ్ అసెస్‌మెంట్–2) పరీక్షలు జరుగుతాయని డీఈవో విజయేంద్రరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 6 వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు విద్యార్థులకు సంబంధిత సిలబస్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉమ్మడి ప్రశ్నపత్రం ఆధారంగా పాత పద్ధతిలోనే పరీక్షలు జరుగుతాయని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాలను పరీక్ష జరిగే రోజు ఎంఈవోలు సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిస్తారని చెప్పారు. పరీక్షకు గంట ముందు ఆయా హెచ్‌ఎంలు ప్రశ్నపత్రాలను పంపాలని ఎంఈవోలను ఆదేశించామన్నారు. 9,10 తరగతుల విద్యార్థులకు రోజూ ఉదయం రెండు పరీక్షలు, 6,7,8 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం పరీక్షలు ఉంటాయని తెలిపారు. 1 నుంచి 5 వ తరగతి విద్యార్థులకు ఉదయం ఒకటి, మధ్యాహ్నం మరో సబ్జెక్టులో పరీక్షలను నిర్వహిస్తారన్నారు. షెడ్యూల్ ప్రకారం పరీక్షలు పూర్తి అయిన వెంటనే ఈనెల 10 వ తేదీలోపు జవాబుపత్రాలను అందజేయాలని చెప్పారు. ఈ విషయంలో టీచర్లు అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10 వ తేదీన తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి, విద్యార్థుల ప్రగతిని తెలియజేయాలన్నారు. అనంతరం ఈనెల 14 నుంచి 24 వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులు ఉంటాయని డీఈవో వెల్లడించారు.

దశాబ్దం నాటి కల సాకారం

- రూ.27 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జికి శంకుస్థాపన
- అధిక నిధులు పొందిన రెండవ నియోజకవర్గంగా జీడీనెల్లూరు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వేదికపై ఎంపీ రెడ్డెప్ప, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, కలెక్టర్ షణ్మోహన్

శ్రీరంగరాజపురం : గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజల దశాబ్దం నాటి కల సాకారానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదివారం శ్రీకారం చుట్టారు. మండలంలోని ఉడమలకుర్తి గ్రామం వద్ద కుశస్థలి నదిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.27 కోట్లతో ఎంపీ రెడ్డెప్ప, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌తో కలసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంగా తమిళనాడు,ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు నుంచి ఇక్కడ హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం ఒక కలగా ఉందని, 1972లో కుశస్థలి నదిపై అప్పటి సీఎం జలగం వెంగళరావు హయాంలో కృష్ణపురం జలాశయం నిర్మించారని తెలిపారు. వరదలు వచ్చినప్పుడు జలాశయం గేట్లు ఎత్తడం ద్వారా పంటలతో పాటు ప్రాణనష్టం సంభవించేందని తెలిపారు. తాను సమితి అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి హై లెవెల్ బ్రిడ్జి కోసం అనేక పోరాటాలు చేశానని గుర్తు చేసుకున్నారు. నేడు బ్రిడ్జి నిర్మాణాని ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న రూ.27 కోట్లను మంజూరు చేశారని తెలిపారు. రాష్ట్రంలోనే అధిక నిధులు పొందిన రెండవ నియోజకవర్గం గంగాధరనెల్లూరు అని తెలిపారు. పాపిరెడ్డిపల్లె, పాతపాళ్యం కాలువపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.



హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

మహిళాభ్యున్నతే లక్ష్యం

చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం విప్లవత్మకమైన పథకాలను ప్రవేశపెట్టి ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేయడాన్ని జీర్ణించుకోలేని టీడీపీ విష ప్రచారం చేస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. స్థానిక సర్పంచ్ చిట్టిమహేష్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నయీముల్లా, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ సరిత, తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ కృష్ణయ్య, ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

రమణీయం..విమానోత్సవం



విమాన వాహనంపై ఉభయదేవేరులతో విహరిస్తున్న విఘ్ననాథుడు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి విమానోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వేకువ జామున మూలవరులకు ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అశేషసంఖ్యలో విచ్చేసి శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి అలంకార మండపంలో శ్రీసిద్ధి, బుద్ధి, సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను ఉభయదారులు తీసుకొచ్చిన క్షీరంతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేపట్టారు. పట్టుపీతాంబరాలు, సుగంధభరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో అలంకరించి ఊరేగింపుగా విమాన వాహనంపై కొలువుదీర్చారు. తదుపరి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, కొలాటాలు, భజన బృందాల ప్రదర్శనల నడుమ విమానోత్సవం రమణీయంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

నేడు సూర్యప్రభ వాహనం

ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి స్వామి వారు సూర్యప్రభ వాహనంపై దర్శనమిస్తారని దేవస్థానం ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు ఉంటాయన్నారు.

రికార్డు స్థాయిలో రాహు- కేతు పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రికార్డు స్థాయిలో రాహుకేతు పూజలు నిర్వహించారు. మొత్తం 5,655 రాహు–కేతు సర్ప దోష నివారణ పూజలు, 133 రుద్రాభిషేకాలు, ఇతర పూజలు నిర్వహించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రత్యేక దర్శనం టికెట్లు రూ.200 – 4,300, 50 రూపాయల ప్రత్యేక దర్శనం టికెట్లు 5,200 విక్రయించినట్లు తెలిపారు. ఆదివారం ఒక్కరోజే శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనానికి సుమారు 30 వేల మంది భక్తులు వచ్చినట్లు వివరించారు. దేవస్థానం ధర్మకర్త మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు క్యూలను క్రమబద్ధీకరిస్తూ భక్తులకు సుదర్శన ఏర్పాట్లు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున్ ప్రసాద్, ఏఈఓ ధనపాల్, ఆలయ అధికారులు సుదర్శన్ తదితరులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

స్తంభించిన ట్రాఫిక్

అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో ఆలయం నుంచి బయటకు వెళ్లే జల వినాయకుడి గుడి, కన్నప్ప వంతెన పరిసరాల్లో వాహనాలను పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. సుమారు గంట పాటు భక్తులు ఇబ్బంది పడ్డారు. ఆలయ సెక్యూరిటీ, పోలీసులు గానీ అటు రాకపోవడం విమర్శలకు దారితీసింది.

మహిళలంటే గౌరవం లేని టీడీపీకి గుడ్‌బై



వైఎస్సార్ సీపీలో చేరినవారితో మంత్రి ఆర్కేరోజా


- వైఎస్సార్ సీపీలోకి 40 టీడీపీ కుటుంబాలు
- కలసి అందరికీ మంచి చేద్దాం అన్న మంత్రి ఆర్కే రోజా

నగరి: పక్షపాతం చూపకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తోందని, అలాగే మంత్రి ఆర్కే రోజా అన్నిప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నారని, ఇంతలా మంచి చేసే వారికి తాము అండగా నిలబడతామంటూ మండలంలోని కృష్ణారామాపురం గ్రామానికి చెందిన 40 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్‌లో చేరాయి. ఆదివారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో టీడీపీ నాయకులు ప్రకాష్ రెడ్డి, రామూర్తి రెడ్డి, పుణ్యకోటి రెడ్డి, హరిబాబురెడ్డి, త్యాగరాజురెడ్డి, హరినాథరెడ్డి, చిదంబర రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, లోకనాథ రెడ్డి నాయకత్వంలో వారంతా పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి కండువాలు వేసి మంత్రి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆప్యాయంగా మంత్రిని పలకరించిన వారు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీ నుంచి ఉన్నామని, టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికంటే ఇప్పుడే తమకు ఎక్కువగా మేలు జరిగిందన్నారు. మంచి చేసిన వారిని మరవకూడదని అది మానవ ధర్మమన్నారు. అందుకే అందరం కలిసి నిర్ణయించుకొని వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. పార్టీకి అండగా నిలబడతామన్నారు.

భాను వ్యాఖ్యలు బాధించాయి

పార్టీలో చేరిన మహిళలు మాట్లాడుతూ మంత్రి ఆర్కేరోజా తన ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం, పార్టీలకతీతంగా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడం తమను ఆకర్షించిందని, ఇటీవల టీడీపీ ఇన్‌చార్జి భానుప్రకాష్ మంత్రి రోజాపై చేసిన అసభ్య వ్యాఖ్యలు తమను ఎంతో బాధించాయన్నారు. రాజకీయాల్లో విమర్శలు సాధారణమే అయినా మహిళను నీచంగా విమర్శలు ఎవరూ చేయరన్నారు. అలాంటి సంస్కృతి ఉన్న నాయకుడున్న పార్టీలో ఉండకూడదనుకుని నిర్ణయించామని తెలిపారు. అందుకే మహిళను గౌరవించే పార్టీలో చేరుతున్నామన్నారు. మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ జగనన్న పాలనలో ఎలాంటి బేధాభిప్రాయాలు ఉండవన్నారు. కలసి పనిచేస్తూ అందరికీ మంచిచేద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుదర్శననాయుడు, మండల సచివాలయ కన్వీనర్ హరిబాబు, నాయకులు ఆనందరెడ్డి, ధనపాల్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు సనాతన ధర్మం



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: ఆద్యంతాలు లేని సనాతన ధర్మ వైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కృష్ణమూర్తి తెలిపారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి తెలుగు కళా వేదిక సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ – తిరుపతి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు భారతీయ భాషా కవులతో వైభవంగా సాగిన కవి సమ్మేళనం ఆదివారం ముగిసింది. భారతదేశ మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కార్యక్రమానికి విచ్చేసిన వారిని అభినందిస్తూ ప్రత్యేక సందేశాన్ని పంపించారు. వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఆలోచనా విధానంలో మార్పు రావాలని ఆకాంక్షించారు. విషయ పరిజ్ఞానం పెంచుకుని, సానుకూల మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సనాతన ధర్మం ఎప్పుడు పుట్టిందో చరిత్రకారులకు అందదని వక్తలు అభిప్రాయపడ్డారు. నిత్య ఉషోదయంతో దినదిన ప్రవర్ధమానమై సనాతన ధర్మం వర్ధిల్లుతుందని చెప్పారు. అన్ని భారతీయ భాషల్లో కవితా సమ్మేళనం జరగటం ఇదే ప్రథమమని వెల్లడించారు. అనంతరం విశిష్టాతిథిగా విచ్చేసిన గాలి గుణశేఖర నాయుడు మాట్లాడుతూ సనాతన ధర్మం అనే అంశంపై కవిసమ్మేళనం గొప్పగా జరిగిందన్నారు. మన ధర్మం యొక్క గొప్పతనాన్ని కవులు చక్కగా వర్ణించారని వివరించారు. దీనికి దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కవులు హాజరయ్యారు. సభాధ్యక్షులు ఆచార్య పి.టి.జి.వి రంగాచార్యులు, తెలుగు వేదిక అధ్యక్షురాలు కోడూరు సుమనశ్రీ, అకడమిక్ డీన్ రాఘవాచార్యులు, రిజిస్ట్రార్ కమాండర్ చల్లా వెంకటేశ్వర్, విభిన్న భాషాపండితులు, కవులు, సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తులతో పోటెత్తిన కాణిపాకం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఆది, సోమవారాలు వరుస సెలవులు రావడం, ప్రత్యేక ఉత్సవాలు జరుగుతుండడంతో వివిధ రాష్ట్రాల భక్తులు అశేషంగా తరలి వచ్చారు. ఉదయం నుంచే క్యూల్లో భక్తులు బారులు తీరారు. రూ.150, రూ.100, ఉచిత క్యూలు నిండి భక్తులు ఆలయం వెలుపలి వరకు బారులు తీరారు. భక్తులు త్వరితగతిన దర్శనం చేసుకునేలా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తగు చర్యలు తీసుకున్నారు. వృద్ధులు, గర్భిణులను ప్రత్యేక క్యూల్లో దర్శనానికి అనుమతి ఇచ్చారు.

అంగన్‌వాడీ సిబ్బందికి మెమోలు

రొంపిచెర్ల: కుక్క కాటుకు గాయ పడిన చిన్నారి ఘటనలో వారణాసివారిపల్లె అంగన్‌వాడీ సిబ్బందికి మెమోలు జారీ చేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీషా ఆదివారం తెలిపారు. శనివారం తన అనుమతి లేకుండా సెలవు పెట్టిన ఆయా లీలావతి, చిన్నారి కుక్క కాటుపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీదేవికి మెమోలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సెలవు కావాలంటే కార్యాలయంలో లీవ్‌లెటర్ ఇచ్చి, ఫోన్ ద్వారా తనకు సమాచారం ఇవ్వాలన్నారు. హాజరు రిజిస్టర్‌లో10.30 గంటల లోపు సంతకాలు చేయాలని సూచించారు.

అంతా కార్డ్ లెస్

డిజిటల్ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డుల జారీ విధానం అమల్లోకి వచ్చింది. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కార్డులను ప్రింట్ చేసి జారీ చేసే పాత విధానానికి రవాణాశాఖ స్వస్తి పలికింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర రవాణా శాఖ స్వాగతిస్తూ డిజిటల్ కార్డుల జారీ విధానానికి శ్రీకారం చుట్టింది. డీజీ లాకర్‌తో పాటు ఎం- పరివాహన్ అప్లికేషన్లో ఇవి అందుబాటులో ఉంటాయి. నూతన విధానంలో తనిఖీ అధికారులు వాహనదారుడి పూర్తి సమాచారం క్షణాల్లో పొందవచ్చు. ఈ విధానం తనిఖీలకు సులభతరంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

- డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డులకు సెలవు
- ఇకపై కేవలం డిజిటల్ డాక్యుమెంట్లే
- స్మార్ట్‌ఫోన్లో డౌన్ చేసుకుంటే చాలు
- తనిఖీ అధికారులకు ఫోన్‌లో డాక్యుమెంట్లు చూపితే చాలు



చిత్తూరు రూరల్: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక అవసరాలకు తగ్గట్టుగా రవాణా శాఖ కీలక విధాన నిర్ణయం తీసుకుంది. వాహనదారులకు ఊరట కలిగించేలా డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కార్డుల జారీని నిలిపివేసింది. నూతన విధానంలో లైసెన్స్ మంజూరు చేసిన ప్రింట్ కార్డులు ఇవ్వరు. ఆన్‌లైన్‌లో డిజిటల్ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డుల డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు రవాణాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. వాహనదారులు రవాణాశాఖ వెబ్‌సైట్ ఫారం 6 లేదా 23ని డౌన్‌లోడ్ చేసుకుని డాక్యుమెంట్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. మొబైల్‌లో ఏపీఆర్టీఏ సిటిజన్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. స్మార్ట్ ఫోన్లు లేని వారు మాత్రం పేపర్ ప్రింట్ తీసుకుని జేబులో పెట్టుకోవాల్సి ఉంటుంది. లైసెన్సులు, ఆర్సీలకు ఇప్పటి వరకు కార్డుకు రూ.200, పోస్టల్ సర్వీస్‌కు రూ.25 మొత్తం రూ.225 చలానాతో కలిపి వసూలు చేసేవారు. డిజిటల్ విధానంలో ఆ చార్జీలను వసూలు చేయడం లేదు. ఇప్పటికే డబ్బులు చెల్లించిన వారికి మాత్రం త్వరలో కార్డులను అందజేయనున్నారు. రవాణా శాఖకు సంబంధించి కేంద్రం 'వాహన్ పరివార్'తో సేవలన్నీ ఆన్‌లైన్ చేయడంతో చాలా రాష్ట్రాల్లో కార్డులను తొలగించి, డిజిటల్ రూపంలోనే పత్రాలు తీసుకొచ్చారు. ఇప్పుడు ఏపీలో కూడా దీన్ని అమల్లోకి తెచ్చారు. పోలీసులు, రవాణాశాఖ అధికారులు వాహనాల్ని తనిఖీలు చేసే సమయంలో డౌన్‌లోడ్ చేసిన పత్రాలను చూపిస్తే సరిపోతుంది. వీటిని అనుమతించాలని తనిఖీలు చేసే పోలీసు, రవాణా తదితర శాఖల అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. రెండేళ్లుగా లైసెన్స్, ఆర్సీ కార్డుల కోసం ఎదురుచూస్తున్న లక్షల మంది వాహన దారులకు డిజిటల్ విధానంతో క్లారిటీ వచ్చినట్లయింది. ఈ పరిణామాల వెనుక ఓ కీలక కారణం ఉంది. రవాణాశాఖకు సంబంధించిన అన్ని వ్యవహారాల్ని కేంద్ర ప్రభుత్వం వాహన్ పరివార్ వెబ్ సైట్‌లో చేర్చింది. దీంతో రాష్ట్రాల రవాణాశాఖ వెబ్ సైట్లలో ఏదీ అందుబాటులో లేకుండా పోయింది. గతంలోలా కార్డుల డౌన్ లోడ్ వంటి ఆప్షన్లు కూడా తీసేశారు. ఇప్పుడు కొత్త విధానంలో వెబ్ సైట్లలో ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్సును డౌన్ లోడ్ చేసుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పిస్తోంది.

అంతా స్మార్ట్ సేవలు



నూతన విధానంలో లైసెన్స్ మంజూరు చేసిన తరువాత ఎలాంటి ప్రింట్ కార్డులు ఇవ్వరు. కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే లైసెన్స్ పత్రాలను పంపుతారు. వీటిని వాహనదారుడు ప్రింట్ తీసుకుని తన వద్ద ఉంచుకోవచ్చు. అలాగే ఫోన్‌లో కూడా భద్రపరుచుకోవచ్చు. అధికారుల తనిఖీల సమయంలో డౌన్‌లోడ్ చేసుకున్న డాక్యుమెంట్లను ఫోన్‌లో చూపితే సరిపోతుంది. మారుతున్న కాలనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా నూతన విధానాలకు శ్రీకారం చుట్టింది. ఈ విధానం వాహనదారులకు సౌలభ్యంగా ఉంటుంది.


-నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు

పేకాట స్థావరంపై దాడి.. ఐదుగురి అరెస్ట్

తవణంపల్లె: మండలంలోని దిగువ మత్యం సమీపంలో కొండ పక్కన ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారంతో సిబ్బంది దాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న బంగారుపాళ్యానికి చెందిన టి.సెల్వరాజ్(52), మొగిలివెంకటగిరికి చెందిన వి.లోకేష్(30), 170 గొల్లపల్లె ఎర్రన్నపల్లెకు చెందిన ఎస్.దేవనాయుడు, బంగారుపాళ్యానికి చెందిన డి.దుర్గాప్రసాద్(32), కె.సతీష్(33)ను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వీరి నుంచి రూ.14,620 నగదును స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గుడిపాల: మండలంలోని నంగమంగళం వద్ద ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఇన్‌చార్జ్ ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని నంగమంగళం స్టేట్‌బ్యాంక్ సమీపంలో గుర్తు తెలియని కారు ఓ వ్యక్తిని ఢీకొని ఆగకుండా వెళ్లింది. ఈఘటనలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గాయపడిన వ్యక్తి కేరళ రాష్ట్రానికి చెందిన చంద్ర(58)గా గుర్తించారు. 108 వాహనంలో చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతను కోలుకోగానే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.



నేడు వాహనాల వేలం

గుడిపాల: సారా, మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను గుడిపాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బొలేరో, ఏడు స్క్రాబ్ ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

పాడి ఆవుల చోరీ

గంగవరం: మండలంలోని గుండుగల్లు గ్రామంలో ఇంటి ముందు కట్టి ఉంచిన రెండు పాడి ఆవులు చోరీకి గురయ్యాయి. ఆదివారం గంగవరం పోలీసులకు ఆదివారం ఈమేరకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. వివరాల మేరకు అహ్మద్‌బాషా శుక్రవారం రాత్రి ఇంటి ముందు గొడ్లపాకలో యథావిధిగా కట్టి ఉంచాడు. శనివారం ఉదయం గొడ్లపాకలో ఆవులు లేవు. చుట్టుపక్కల పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించక పోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైకును ఢీకొన్న లారీ.. చిన్నారి మృతి

-దంపతులకు తీవ్రగాయాలు



మృతదేహాన్ని తరలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర శివారుల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మన్‌మోహిత్ (4) మృతి చెందింది. గుడిపాల మండలం చిత్తపారకు చెందిన రాజేష్ ఓ బ్యాటరీ కంపెనీ క్యాంటీన్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. చిత్తపార నుంచి భార్య, బిడ్డతో బైకులో కాణిపాకం బయలుదేరాడు. బైకు ఇరువారం బైపాస్ వద్ద రాగానే బైక్‌ను చెన్నై వైపు వెళుతున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మన్‌మోహిత్ లారీ టైరు కింద పడి ప్రాణాలు వదలగా.. రాజేష్, రాధకు రక్తగాలయ్యాయి. చిన్నారి మృతదేహానికి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దంపతులు ఇద్దరూ కోలుకుంటున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, చిత్తూరు ట్రాఫిక్ ఎస్‌ఐ జయప్ప కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



సదుం: గాయపడ్డ దంపతులు

సదుం: మండలంలోని గొంగివారిపల్లె సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయడపడ్డారు. స్థానికుల కథనం మేరకు ఊటుపల్లెకు చెందిన మునాఫ్, జరీనాబీ ద్విచక్ర వాహనంలో సదుంకు బయలు దేరారు. మార్గమధ్యంలో గొంగివారిపల్లె సమీపంలోని రైస్‌మిల్ వద్ద ఎదురుగా ఆవు అడ్డం రావడంతో వాహనం అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో కిందపడిన దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

ఘాట్‌రోడ్డులో ఆగిన ఎలక్ట్రిక్ బస్సు



ఘాట్ రోడ్డులో ఆగిన ఎలక్ట్రిక్ బస్సు

తిరుమల: తిరుమల మొదటిఘాట్ రోడ్డులో ఎలక్ట్రిక్ బస్సు సాంకేతిక సమస్యలతో ఆగిపోయిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఘాట్ రోడ్డు లోని అక్కగార్లగుడి సమీపంలో బస్సు నిలిచిపోయిన వెంటనే సమాచారం అందుకున్న సాంకేతిక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. బస్సుకు సరిపడా చార్జింగ్ లేదని గుర్తించారు. అందులోని ప్రయాణికులను మరో బస్సులో తిరుపతికి తరలించారు. అనంతరం చార్జింగ్ చేసి బస్సును నడిపించారు.

రక్షణ గోడను ఢీకొన్న కారు

తమిళనాడు కోయంబత్తూరుకు చెందిన భక్తులు కారులో తిరుమలకు వచ్చి తిరిగి వెళుతుండగా వినాయకస్వామి ఆలయానికి సమీపంలో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో పక్కనే ఉన్న రక్షణ గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో భక్తులు తృటిలో తప్పించుకున్నారు. అయితే ట్రాఫిక్ స్తంభించిపోయింది. భద్రతా సిబ్బంది ట్రాఫిక్ పునరుద్ధరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠా అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ సత్యబాబు, ఎస్‌ఐ

పాలసముద్రం : జిల్లాలో పలు ప్రాంతాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసే ముగ్గురు సభ్యుల ముఠాను ఆదివారం పోలీసులు అరెస్టు చేసినట్లు కార్వేటి నగరం సీఐ పి.సత్యబాబు తెలిపారు. నిందితుల అరెస్టును చూపి, వివరాలను ఆయన వెల్లడించారు. కొన్ని నెలలుగా పాలసముద్రం మండలంలో పలుచోట్ల రాత్రి వేళల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ అవుతున్నాయి. వాటిలోని రాగి తీగలు, ఆయిల్‌ను దుండగులు తస్కరిస్తున్నారు. వీటిపై కేసులు నమోదు అయ్యాయి. డీఎస్పీ ఆదేశాల మేరకు పాలసముద్రం ఎస్‌ఐ ప్రసాద్ ప్రత్యేక నిఘా ఉంచారు. ఆదివారం మండలంలోని రంగాపురం క్రాస్ వద్ద బజాజ్ పల్సర్ వాహనంలో ముగ్గురు రాగి తీగలు తీసుకు వస్తున్నారు. అక్కడే ఉన్న పోలీసులను చూసి వేగంగా బైక్‌ను నడిపేందుకు ప్రత్నించారు. ఎస్‌ఐ సిబ్బందితో చాకచక్యంతో వారిని పట్టుకున్నారు. వాహనంలో 30 కేజీల రాగి వైర్లు ఉన్నాయి. వీరిని గంగాధరనెల్లూరు మండలం బంగారెడ్డిపల్లెకు చెందిన మోహన్, ఢిల్లీ బాబు, గణేష్‌గా గుర్తించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. విచారణలో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. బాలకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఆముదాల, ఆముదాల పుత్తూరు, గంగాధరనెల్లూరు మండలం, ఎస్సార్‌పురం, చిత్తూరు తాలుకా, ఎస్‌ఆర్ పేట, విజయపురం, పెనుమూరు, కల్లూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రాన్స్ ఫార్మర్ల చోరీ కేసులకు సంబంధించి సుమారు 500 కేజీల రాగి వైర్లు రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులను ఎస్‌ఐ ప్రసాద్ చిత్తూరు కోర్టులో హాజరు పరిచారు.

కర్ణాటక మద్యం సీజ్.. ఇద్దరి అరెస్టు



చిత్తూరులో నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్‌ఈబీ అర్బన్ పోలీసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో కర్ణాటక మద్యం విచ్చలవిడి అమ్మకాలపై పోలీసులు కన్నెర్ర చేస్తున్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) ఏఎస్పీ శ్రీలక్ష్మి ఆదేశాలతో ఆ శాఖ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్‌ఈబీ చిత్తూరు అర్బన్ సీఐ జోగేంద్ర, ఇంటెలిజెన్స్ సీఐ వెంకటలక్ష్మి, సిబ్బందితో కలిసి ఎంజీఆర్ వీధిలో తనిఖీలు నిర్వహించారు. హకీం సాహెబ్ వీధిలో 26 బాక్సుల్లో 2,496 మద్యం ప్యాకెట్లు కలిగి ఉన్న జమీల్, ఇమ్రాన్ అరెస్టు చేశారు. వీరికి మద్యం సరఫరా చేసే కుమార్ పోలీసులను చూసి పారిపోగా, అతనిపై కూడా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ బాబు, పృథ్వీ, సిబ్బంది గోవిందరాజులు, రాజ్‌దీప్, దినకర్, వెంకటేష్, శైలజ పాల్గొన్నారు.

బంగారుపాళ్యెంలో మరొకరు..

ఎస్‌ఈబీ చిత్తూరు రూరల్ ఎస్‌ఐ మోహన్‌బాబు సిబ్బందితో కలిసి ఆదివారం బంగారుపాళ్యం పరిసరాల్లో తనిఖీలు నిర్వహించారు. నలగాంపల్లె కూడలిలో ఓ సంచిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న టి.అనిల్‌కుమార్ (35)ను అరెస్టు చేశారు. పాపుదేశి కండ్రిగకు చెందిన ఇతని నుంచి 56 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సిబ్బంది కృష్ణయ్య, వెంకటేష్, మమత పాల్గొన్నారు.



అట్టహాసం.. ఘటోత్సవం

పోలేరమ్మ జాతర అట్టహాసంగా ప్రారంభమైంది. వెంకటగిరి జనసంద్రంగా మారింది. కిక్కిరిసిన వీధిల్లో పోలేరమ్మ ఘటం కదిలింది. పటిష్టమైన బందోబస్తు మధ్య సంప్రదాయబద్ధంగా ఈ ఘటోత్సవం ఆరంభమైంది. ఐదు రోజులపాటు సాగే ఈ జాతరలో వీఐపీ పాసులు రద్దు చేస్తున్నట్లు కమిటీ ప్రకటించింది. సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనం సులభతరం చేసింది.

- అశేష జనసందోహం నడుమ కదిలిన ఘటం
- వెంకటగిరి పోలేరమ్మ జాతర ప్రారంభం
- వీఐపీ పాసులు రద్దు : నేదురుమల్లి



అశేష భక్తజనుల నడుమ ఘటం ఊరేగింపు



మాట్లాడుతున్న నేదురుమల్లి

సైదాపురం/వెంకటగిరిరూరల్ : అశేష భక్త జన సందోహం నడుమ అత్యంత వైభవంగా పోలేరమ్మ ఘటోత్సవం ఆదివారం ప్రారంభమైంది. వెంకటగిరి జాతరలో మొదటి ఘట్టంగా భావించే ఈ ఘటోత్సవానికి భక్తులు తరలిరావడంతో పట్టణం జనసంద్రమైంది. ఏ వీధి చూసినా జనంతో కిక్కిరిసిపోయింది. గాలిగంగుల దేవస్థానం నుంచి కదిలిన ఘటం మధ్యాహ్నం 3 గంటలకు జీనిగల వారి వీధికి చేరుకుంది. అక్కడ మండపంలో సంప్రదాయ బద్ధంగా తప్పెట్లు, తాళాలు, బాణాసంచా వెలుగుల మధ్య ఘటం ఊరేగింపు ప్రారంభమైంది. అక్కడి నుంచి పోలేరమ్మ వీధి, రాజా వీధి మీదుగా పోలేరమ్మ దేవస్థానం వద్దకు చేరుకుంది. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం రాజాల భవనంలోకి ప్రవేశించింది. సంప్రదాయబద్ధంగా రాజాల అనుచరులు ఘటానికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అమ్మవారికి బలి ఇచ్చే దున్నపోతున్న ఘటం వెంటే ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. ఈ జాతరలో 4, 5 తేదీల్లో నిర్వహించే ఉత్సవమే ప్రధానం. ప్రభుత్వం ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో దీనికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఘటోత్సవాన్ని పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఢిల్లీబాబు, పోలేరమ్మ గుడి దేవస్థానం మాజీ అధ్యక్షులు పులి ప్రసాద్‌రెడ్డి, ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. బందోబస్తు విధుల్లో 8మంది ఎస్‌ఐలు, ముగ్గురు సీఐలు, 80 మంది సిబ్బందిని నియమించినట్లు గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మూడు ఫైరింజన్లు, 108 వాహనాలను ఆలయ పరిసరాల్లో అందుబాటులో ఉంచారు.

చరిత్రలో నిలిచిపోయేలా జాతర

రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా వెంకటగిరి పోలేరమ్మ జాతరను నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వెంకటగిరి పోలేరమ్మ జాతర నిర్వహణపై వివిధ శాఖ అధికారులు ఆహ్వాన కమిటీసభ్యులు, వివిధ పార్టీ నేతలు, ప్రజాసంఘాల నేతలతో శాంతి సంఘం సమావేశాన్ని నిర్వహించారు. నేదురుమల్లి మాట్లాడుతూ జాతరలో అమ్మవారి దర్శనం సులభతరం చేస్తూ, సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరి జాతరను రాష్ట్రపండుగగా ప్రకటించిన నేపథ్యంలో మొదటిసారిగా ఈ జాతరను కనీవినీ ఎరుగని రీతిలో వైభవోపేతంగా నిర్వహిస్తామన్నారు. జాతరలో భాగంగా ఐదురోజుల పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. భక్తులకు ఈసారి క్యూలో మజ్జిగ ప్యాకెట్లను అందిస్తామన్నారు. ఈ ఏడాది వీఐపీ పాసులను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అమ్మవారి దర్శనం కోసం ఉచిత దర్శనం క్యూతో పాటు రూ.200, రూ.500 దర్శన క్యూలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జాతరలో ఆర్భాటాలకు తావివ్వకుండా ఆచారాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్ రెడ్డి, తహసీల్దార్ పద్మావతి, ఎస్‌ఐ నరసింహారావు, ఈఓ శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ వెంకట్రామయ్య, పట్టణ అధ్యక్షులు ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ బాలయ్య, ఆహ్వానకమిటీ సభ్యులు, పట్టణ వైఎస్సార్‌సీపీ నేతలు ఎల్‌కోటేశ్వరరావు, చట్టేటి హరికృష్ణ, ప్రముఖవైద్యులు కళాధర్, కౌన్సిలర్లు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఘటోత్సవంలో భక్తజన కోలాహలం



దున్నపోతు ఊరేగింపు